క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

ధన్వాడ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల, గ్రామాల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాల్సిందిగా కోరారు.

ఆడపిల్ల పెళ్లికి పుస్తెమెట్టెలు



మద్దూరు: కొత్తపల్లి మండలంలోని నిడ్జింత గ్రామానికి చెందిన గణేష్ యువజన సంఘం సభ్యులు పేదింటి ఆడపిల్ల పెళ్లికి పుస్తెమెట్టెలు, రూ. 2వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. గ్రామానికి చెందిన పుల్లప్ప కూతురు పెళ్లికోసం సంఘం సభ్యులు పుస్తెమెట్టెలతో పాటు రూ. 2వేలు ఆర్థిక సాయం అందజేశారు. సంఘం సభ్యులు అంజిలయ్య, శ్రీను, మెహన్‌రెడ్డి, వినోద్, తిమ్మారెడ్డి, కాశప్ప, వెంకట్‌రాములు, విజయ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మరికల్: మండల కేంద్రంలోని పటేల్‌రోడ్డు కాలనీలోని ముంతాజ్‌బేగం అనే మహిళ అనారోగ్యంతో మృతిచెందడంతో శుక్రవారం సూర్యచంద్ర ఫౌండేషన్ చైర్మన్ సూర్యమోహన్ రెడ్డి ఆర్థిక సాయంగా రూ. 10వేలు అందజేసి మానవత్వం చాటుకున్నారు. బాధిత కుటుంబానికి తమ సంస్థ తరపున అలాగే ప్రభుత్వ పరంగా రావాల్సిన ఆర్థికసాయాన్ని ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, రాఘువేందర్, ఆంజనేయులు, రామకృష్ణారెడ్డి, సత్యన్న, గంగిరెడ్డి, రవి, రాములు, చాంద్‌పాషా, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో గ్రామసభ



మరికల్: మండలంలోని ఇబ్రహీంపట్నం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామసభను నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రణాళిక తయారీ అంశంపై చర్చించారు. అలాగే పలు అభివృద్ధి పథకాలపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ గోపాల్, పాపిరెడ్డి, పరుశురాం, కవిత, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకుల ఆందోళన



అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పురుగులతో కూడిన అన్నం వడ్డిస్తున్నారని ఏబీబీపీ విద్యార్థి సంఘం నాయకులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఏబీవీపీ మండల కన్వీనర్ అఖిల్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన తయారీలో పురుగుల బియ్యం వండుతున్నారని, వంట ఏజెన్సీ మహిళలు బియ్యంలోని పురుగులను తొలగించట్లేదని ఆరోపించారు. పాఠశాలలో పాత స్టాక్‌గా ఉన్న బియ్యాన్ని వెంటనే మార్చాలని పాఠశాల హెచ్‌ఎం బలరాముడుకు విన్నవించినా ఫలితం లేదని అసహనం వ్యక్తంచేశారు. పురుగుల అన్నం తినడంతో విద్యార్థులకు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో ఇళ్లకు వెళ్లి భోజనం చేస్తున్న పరిస్థితులు దాపరించాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన బియ్యం అందించి మధ్యాహ్న భోజనంలో పురుగులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని హెచ్‌ఎం బలరాముడుకు అందించారు. ఈ కార్యక్రమంలో సందీప్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

నిద్రపోతున్న నిఘా నేత్రం

- నిర్వహణ లేక పనిచేయని కెమెరాలు
- సీసీ కెమెరాలు బాగుచేయాలని కోరుతున్న జనం



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సీసీ టీవీ వ్యూ



మాగనూర్ అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న సీసీ కెమెరాలు

మాగనూర్: మండలంలోని నిఘా నేత్రాలు అలంకార ప్రాయంగా మారాయి. మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినా అందులో చాలా వరకు పనిచేయడం లేదు. అభివృద్ధి పనులు, కోతుల బెడదవంటి కారణాలు నిఘా నేత్రాలకు ఆటంకం కలిగిస్తున్నాయి. కోతుల దాడులో వైర్లు తెగిపోయి సీసీ కెమెరాలు పని చేయడం లేదు. సీసీ కెమెరాల మరమ్మతులతోపాటు వాటి నిర్వాహణ పోలీసులకు భారంగా మారింది.

నిర్వాహణ ఇబ్బందులు..

మండల కేంద్రంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. సీసీ కెమెరాలను కోతులు ధ్వంసం చేస్తుండటంతో సీసీ కెమెరాల నిర్వాహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మాగనూర్ బస్టాండ్ చౌరస్తా, ఇండియన్ గ్యాస్ వద్ద సీసీ కెమెరాలు ఉన్నాయి. మిగితా కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసిన వాటికి కోతుల బెడద తప్పడం లేదు. ప్రస్తుతం ప్రధాన చౌరస్తాతోపాటు వర్కూర్, కొత్తపల్లి క్రాస్‌రోడ్డు కూడలీల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉంది.

కరువైన పర్యవేక్షణ..

పోలీసులకు నేర పరిశోధనలో సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. కమ్యూనిటీ పోలీసింగ్ పేరిట పోలీసులు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో నేరం జరిగినప్పటి నుంచి కేసును చేధించేందుకు పోలీసులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. సీసీ కెమెరాలు వచ్చాక వారి పని సులువైంది. క్లిష్టమైన కేసులను చాలా సులువుగా చేధిస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి సీసీ కెమెరాల ఏర్పాటు, నిర్వాహణకు నిధుల కేటాయింపు లేక పోలీస్‌శాఖకు తలనొప్పిగా మారింది. చాలా చోట్ల కెమెరాలు పనిచేయడం లేదు. నిర్వాహణ, పర్యవేక్షణ సరిగ్గా లేక మరుగున పడిపోతున్నాయి.

మండలంలో పలు చోరీలు..

మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో దొంగలు తమ చేతివాటం చూపుతున్నారు. గతంలో నల్లగట్టు మారెమ్మవ్వ సమీపంలో మేకల దొంగతనం, మోటార్ల దొంతనంతోపాటు పలు చోట్ల దొంగతనాలు కూడా జరిగిగాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వీటితోపాటు మక్తల్ పట్టణంలో జరుగుతున్న వరుస దొంగతనాలు ప్రజల భయాన్ని ఇంక పెంచుతున్నాయి. మరోవైపు పోలీసులు మాత్రం ఆందోళన మాని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు.

త్వరలో బాగుచేయిస్తాం..



మండల కేంద్రంలో దాతల సాయంతో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటిలో కొన్ని వినియోగంలో ఉన్నాయి. కోతుల బెడద కారణంగా పలు సీసీ కెమెరాలు పని చేయడం లేదు. త్వరలోనే సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపడుతాం.

- మల్లేష్ ఎస్‌ఐ, మాగనూర్

కడపరాయ.. జాతర ఉత్సవాలు



కడపరాయుడి దేవాలయం



స్వామివారి మూలవిరాట్

- ముస్తాబైన దేవాలయం
- రేపటి నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు
- అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేసిన దేవస్థాన కమిటీ సభ్యులు

ధన్వాడ: మండలంలోని గున్ముక్లలో కడపరాయ వేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాలు రేపటినుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 24నుంచి 29వ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఇందుకుగాను నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. కడపరాయుడు ఆలయానికి మూడు వందల సంవత్సరాల చరిత్ర ఉంది. వేంకటేశ్వరస్వామి భక్తుల కోరిక మేరకు కడప జిల్లా నుంచి ఇక్కడ వచ్చి కొలువై ఉన్నందున ఈ ఆలయానికి కడపరాయుడు అని పేరు వచ్చిందని గ్రామస్తులు చెబుతుంటారు. కోరిన కోర్కెలు తీర్చేదేవుడిగా ఈ భగవంతుడిని జనం కొలుస్తుంటారు. ఇక్కడ ప్రతి ఏటా నిర్వహించే ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. ఉత్సవాల నిర్వహణకు అన్నిఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే నూతనంగా భక్తులు అందించిన విరాళంతో ఆలయ ముందు కల్యాణ మండపాన్ని ఏర్పాటుచేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆలయ పూజారి నాగరాజు తెలిపారు.

ఉత్సవాలు నిర్వహించే తేదీలు..

జాతర తొలిరోజు 24న స్వామివారికి అలంకరణ చేస్తారు. సోమవారం స్వామివారి ఉద్దాల సేవలలో భాగంగా స్వామివారి ఉద్దలాను ఆలయానికి తీసుకొస్తారు. వీటిని కిష్టాపూర్‌కు చెందిన భక్తులు ఉద్దాలను రాంకిష్టాయపల్లి, మణిపూర్, ధన్వాడ, కంసాన్‌పల్లి మీదుగా జాతర ప్రాంతానికి కాలినడకన తీసుకొస్తారు. ఉద్దాల అనంతరం ప్రభాతసేవ నిర్వహణ చేస్తారు. 26న రథోత్సవం రెట్టపట్లు కార్యక్రమం, 27న భక్తులకు అన్నదానం జాతర, దాసంగాలు, 28న పాల ఉట్లసేవ, భజన పోటీలు, 29న స్వామివారి ఉయ్యాలసేవ, స్వామివారి పల్లకీ సేవ ఊరేగింపుతో ముగిస్తుంది.

భక్తులు సహకరించాలి

జాతర ఉత్సవాలకు వచ్చేభక్తులు ఓపికతో ఉండాలి. గర్భగుడి చిన్నగా ఉండటంతో దర్శనంకోసం ఎక్కువ సేపు వేచి ఉండాల్సి వస్తుంది. భక్తులు కమిటీ సభ్యులకు సహకరించాలి.

నాగరాజు, ఆలయ పూజారి

'అమ్మకు గౌరవం' కేంద్రం ప్రారంభం



ఆత్మకూర్: వాసవీక్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన అమ్మకు గౌరవం కేంద్రాన్ని వాసవీక్లబ్ గవర్నర్లు రామకృష్ణ, రమేష్‌శెట్టి ప్రారంభించారు. శుక్రవారం ఆత్మకూర్‌లోని బస్టాండ్‌లో చంటి పిల్లలు తల్లులు పాలనిచ్చేందుకు ప్రత్యేక గది ఏర్పాటుతో అమ్మకు గౌరవం లభిస్తోందని నిర్వాహకులు అన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్, వనితాక్లబ్ నిర్వాహకులు నీలేష్, కల్వ రఘు, నవీన్, తాందూర్ పవన్ కుమార్, యెలిశెట్టి రాము, వీనశ్రీ, అర్చన, సుమశ్రీ, కల్వ రాజయ్య, వెంకటస్వామి, నాగరాజు, సిద్ధేశ్వర్, రమేష్, సింగం ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

ఆత్మకూర్: రక్తదానం మహాదానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, వివేకానంద సేవా సమితి నిర్వాహకులు దివాన్జీ ప్రభాకర్‌రావు, మాస్టర్ బాలు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా.. 74 మంది రక్తదానం చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. యాదగిరిశెట్టి, సంతోష్‌కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

రామానుజన్ సేవలు మరువలేం



మరికల్‌లో అంకెల రూపంలో కూర్చున్న విద్యార్థులు

నారాయణపేట రూరల్ : శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని పట్టణం, మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం గణితదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అదేవిధంగా గణిత శాస్త్ర నమోనాలు, ఆకృతలను, ముగ్గులు వేసి ప్రదర్శించారు. అనంతరం గణితశాస్త్ర ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మక్తల్: శ్రీనివాసరామానుజన్ జయంతిని పురష్కరించుకుని శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాములు, బాలర్‌రాజు, నాగేష్, కిషన్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాగనూర్: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురష్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మందిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం తిమ్మన్న మాట్లాడుతూ.. గణితశాస్త్రం అభివృద్ధి, మానవాళి పెరుగుదలలో దాని ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జీఎల్‌పల్లి పాఠశాల హెచ్‌ఎం బలరాం, ఉపాధ్యాయులు పరమేశ్వరి, రవికుమార్, శివాజీ పాల్గొన్నారు.

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు శుక్రవారం గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి పాఠశాలలో రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రామానుజన్ గణిత శాస్త్రానికి ఎనలేని కృషిచేశారని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులకు గణిత శాస్త్ర మెలుకువలను తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, వెంకటప్ప, సలాం, లియాకత్ పాల్గొన్నారు.



నారాయణపేటలో..



మాగనూర్‌లో..



మక్తల్‌లో..



ఊట్కూర్‌లో..

చెక్‌డ్యాంలకు భూమి పూజ



వీరన్న గుట్ట వద్ద చెక్‌డ్యాం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

మద్దూరు: మండలంలోని వీరన్న గుట్ట, దోరేపల్లి శివారులో వాగుపై చెక్ డ్యాంల నిర్మాణానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి ప్రజాప్రతినిధులు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. మద్దూరు వాగుపై నిర్మాణం చేపట్టే రెండు చెక్‌డ్యాంలకు సాగునీటి పారుదలశాఖ నుంచి రూ. 5.57 కోట్లు మంజూరైనట్లు ఇరిగేషన్ ఎస్‌ఈ చక్రధర్ తెలిపారు. వీటి నిర్మాణం త్వరగా పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తిరుపతిరెడ్డి సూచించారు. అనంతరం వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండల అధ్యక్షుడు నర్సింహ, వైస్‌ఎంపీపీ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రమేష్‌రెడ్డి, సంజీవ్, రాజశేఖర్‌రెడ్డి, భీములు, రవికుమార్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించేందుకు మరుగుదొడ్ల పరిశీలన



దామరగిద్దలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీధర్



మాగనూర్‌లో

దామరగిద్ద: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో మరుగుదొడ్లు నిర్మించి బిల్లులు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీ ఎంపీడీఓ శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వత్తుగుండ్ల తదితర గ్రామాల్లో మరుగుదొడ్ల బిల్లుల పెండింగ్ లిస్టు ఆధారంగా మరుగుదొడ్లను పరిశీలించారు. లబ్ధిదారు ఆధార్, బ్యాంక్ అకౌంట్‌లను సరిచూశారు. మండలంలో మొత్తం 262 మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో నిర్మించగా మరో 171 అసంపూర్తిగా ఉన్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు సమక్షంలో పరిశీలించి బిల్లులు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

మాగనూర్: గ్రామాలను స్వచ్ఛతగా ఉంచుకోవాలని మండల ఎంపీడీవో శశికళ అన్నారు. ఉపాధిహామీ పథకంలో మరుగుదొడ్లు నిర్మించి బిల్లులు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేందుకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా మంజూరైన మరుగుదొడ్లను నిర్మించుకున్న ప్రతి ఒక్కరికీ పెండింగ్ బిల్లులు వస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా మరుగుదొడ్లను నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సప్ప పాల్గొన్నారు.

పాస్టర్లతో సమీక్ష సమావేశం



పాస్టర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్

కోస్గి: క్రిస్మస్ సందర్భంగా ప్రభుత్వం నుంచి ఉచితంగా దుస్తులు పంపిణీ చేసేందుకు శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసులు మండల పరిధిలోని చర్చి పాస్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పాస్టర్లతో సమావేశమై శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రభుత్వం నుంచి ఉచిత దుస్తులు అందజేస్తామని, పాస్టర్లు క్రైస్తవ కుటుంబాలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆర్ఐ సుభాష్ రెడ్డి, సిబ్బంది, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సూచిక బోర్డు



మాగనూర్: మండలంలోని పూంజనూర్ గ్రామానికి వెళ్లే దారికి గేటు వద్ద ఏర్పాటుచేసిన సూచిక బోర్డుపై ఎటువంటి పేర్లునమోదు చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందికారంగా మారింది. పూంజనూర్ గ్రామానికి మూడమాల్, కోల్పూర్‌నుంచి వచ్చే ప్రజలకు సరైన సూచిక బోర్డులేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఈ దారి గుండా వెళ్లేవారు ఏ గ్రామానికి ఎటు వెళ్లాలనేది ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు స్పందించి సూచిక బోర్డుపై గ్రామం పేరు రాయించాలని కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమరచింత: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందుతున్నారని వికాసత్ భారత్ సంకల్ప యాత్ర కోఆర్డినేటర్ శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని చంద్రగఢ్, కిష్టంపల్లి గ్రామాల్లో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఆదుకుంటుందని, వ్యవసాయ రంగంలో రైతులకు సబ్సిడీలపై యంత్రాలను అందిస్తుందన్నారు. వ్యాపారులకు బ్యాంకు ద్వారా రుణాలను అందిస్తు వారి వ్యాపారభివృద్ధికి దోహద పడుతుందని తెలిపారు. పోస్టాఫీస్‌ల ద్వార ఆడపిల్లలకు సుకన్య యోజన పథకం అమలు చేస్తుందన్నారు. అనంతరం వ్యవసాయ పొలంలో డ్రోన్ సహాయంతో మందుల పిచికారీ గురించి అవగాహన కల్పించారు. ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరసింహులు, ఏపీఓ శ్రీనివాస్,రఘు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి

నారాయణపేట రూరల్ : పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో శుక్రవారం గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీమాత చిత్రపటానికి పూజలు చేసి విద్యార్థులకు భగవద్గీత విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు రతంగ పాండురెడ్డి, లక్ష్మయ్య, అరవింద్, లక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.